క్లుప్తంగా

పుస్తకాలను ప్రేమిద్దాం



లైబ్రరీని పరిశీలిస్తున్న దృశ్యం

పాములపాడు: ప్రతి విద్యార్థి పుస్తకాలను ప్రేమించాలని, కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని కస్టమ్స్ ఆఫీసర్ వేల్పుల ఆనంద్ సూచించారు. శనివారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో సొంత నిధులు రూ.63వేల వెచ్చించి లైబ్రరీని ప్రారంభించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రిన్సిపాల్ నాగరవీంద్ర సూచనల మేరకు పాఠ్యపుస్తకాలు, పోటీ పరీక్షలకు సంబంధించి, మనోవికాసం పెంపొందించుకునే పుస్తకాలు తెప్పించమన్నారు. అనంతరం గ్రంథాలయానికి పుస్తకాలను అందజేశారు. ఎంఈఓ బాలాజీనాయక్, ప్రిన్సిపాల్ నాగరవీంద్ర, ఫిజికల్ డైరెక్టర్ రవి, పీఎంసీ సభ్యుడు వేణు, బీసీ సంఘం నాయకులు శంకర్‌గౌడు, వెలుగోడు సర్పంచు వేల్పుల జయపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా గంధం వేడుకలు



ప్రత్యేకంగా అలంకరించిన ఒంటెపై గంధం తీసుకెళ్తున్న దృశ్యం

మిడుతూరు: మండలంలోని కడుమూరు గ్రామంలో గోకారమయ్య ఉరుసును పురస్కరించుకొని శుక్రవారం అర్ధరాత్రి గంధం వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. 4న రాత్రి గంధం వేడుకల్లో భాగంగా ఒంటెను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలతో ఒంటెపై గంధంను ఉంచి గోకారమయ్య దర్గా వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. శనివారం సాయంత్రం కిస్తీ వేడుకలతో ఉరుసు కార్యక్రమం ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

ఓటర్ల సర్వేలో పొరపాట్లకు తావివ్వొద్దు



మాట్లాడుతున్న ఆర్డీఓ దాసు

పాములపాడు: ఓటర్ల సర్వేలో పొరపాట్లకు తావులేకుండా బూత్ లెవెల్ అధికారులు జాగ్రత్తగా ఉండాలని ఆత్మకూరు ఆర్డీఓ దాసు సూచించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రకారం ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు తెలుసుకోవాలని తెలిపారు. చనిపోయిన, గ్రామాల్లో లేకుండా ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న వారి పేర్లు ఓటరు జాబితా నుంచి తొలగించే ముందు కుటుంబ సభ్యుల నుంచి అంగీకార పత్రం తీసుకోవాలని ఆదేశించారు. ఓటరు జాబితాలో చేర్పులు, మార్పుల విషయంలో పకడ్బందీగా వ్యవహరించాలని చెప్పారు. సర్వేలో గ్రామ వలంటీర్లను భాగస్వామ్యం చేయొద్దని సూచించారు. ఏదైనా సమస్య ఎదురైతే తహసీల్దార్ దృష్టికి తీసుకురావాలన్నారు. తహసీల్దార్ రత్నరాధిక, బీఎల్ఓలు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థిని ఎంపిక

వెలుగోడు: పట్టణంలోని లిటిల్ ఏంజిల్స్ పాఠశాలలో గత విద్యా సంవత్సరం పదో తరగతి చదివిన జే.స్నేహలతారెడ్డి ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. స్కూల్ కరస్పాండెంట్ ఎంఎఫ్ ఇమ్మానుయేలు, హెచ్ఎం బీఏ ప్రశాంతి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

జీవాల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలి

ఆత్మకూరు: గొర్రెలు, మేకల పెంపకంలో యజమానులు పశు సంవర్ధక శాఖ అధికారులతో సలహాలు , సూచనలు తీసుకోవాలని ఆత్మకూరు ఏడీఏ అరుణ తెలిపారు. శనివారం గొర్రెలు, మేకల పెంపకం దారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నల్ల జీవాల పెంపకంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు అధికంగా వస్తాయన్నారు.

10న నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం

మహానంది: నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఈ నెల 10వ తేదీన నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నంద్యాల డీఎం అండ్‌హెచ్ఓ డాక్టర్ వెంకటరమణ తెలిపారు. మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం గ్రామ ఎంపీడీఓ కార్యాలయం వద్ద శనివారం పోస్టర్లు ఆవిష్కరించి ఉపాధ్యాయులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 19 ఏళ్ల లోపు వయస్సున్న వారు 4,06,219 మందిని గుర్తించామన్నారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివనాగజ్యోతి, ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ డాక్టర్ కాంతారావు నాయక్, తిమ్మాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి భగవాన్‌దాస్ ఉన్నారు.

నాడు.. సంక్షేమ పథకాలు పొందాలంటే అదో ప్రహసనం. ఒక పక్క జన్మభూమి కమిటీ సభ్యులు, స్థానిక నాయకుల ఇళ్ల చుట్టూ తిరగాల్సి వచ్చేది. కులం, మతం, రాజకీయ పార్టీలు తదితర అంశాలను బేరీజు వేసుకొని తమ వాడు అని తేలిన తరువాతే పథకం వర్తించేది. దీంతో ఎంతో మంది పేదలు పథకాలకు దూరంగా నిలిచిపోయారు. ఇక మరో పక్క ఆయా పథకాలకు అర్హత పొందేందుకు అవసరమైన ధ్రువ పత్రాలు కావాలంటే పనులన్నీ మానుకొని మండల కేంద్రంలోని కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరిగి అంతో, ఇంతో సమర్పించుకోవాల్సి వచ్చేది. దీంతో తమ ఖర్చులతో పాటు కార్యాలయాల్లో ముట్టజెప్పడానికి బాగానే ఖర్చయ్యేది. చివరగా పథకం సొమ్ము చేతికందే సమయంలో సిఫారసు చేసిన నాయకుడికి వాటా ఇవ్వాల్సి వచ్చేది.

నేడు.. కేవలం అర్హత ఆధారంగా పథకాలు అందుతున్నాయి. ఇందుకు ఎవరి సిఫారసు అవసరం లేదు. వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది విచారణ చేసి నిజమైన అర్హులుగా తేలిస్తే మండల స్థాయి అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పథకం వర్తింపజేస్తారు. ధ్రువ పత్రాల కోసం ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించింది. ఇందులో అధికారులు, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి ఎవరికి ఏ ధ్రువ పత్రం అవసరమో గుర్తించి రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా ఇంటికే వచ్చి అందజేశారు.

ప్రజలకు రక్ష.. ‘జగనన్న సురక్ష’

- పైసా ఖర్చులేకుండా 11రకాల సర్టిఫికెట్ల అందజేత
- నియోజకవర్గంలో 74 సచివాలయాల పరిధిలో 38,530 ధ్రువ పత్రాల పంపిణీ
- 785 మంది కౌలు రైతులకు కౌలు కార్డులు

అర్హులు పథకాలకు దూరంగా ఉండిపోరాదని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించింది. ఇందులో అర్హులకు 11 రకాల ధ్రువ పత్రాల్లో అవసరమైన వాటిని అందజేశారు. నియోజకవర్గంలో 74 గ్రామ సచివాలయాల పరిధిలో 72,436 కుటుంబాలకు గాను 71,407 కుటుంబాలను సర్వే చేసి 38,530 మందికి గ్రామంలోనే అధికారులు సమావేశం ఏర్పాటు చేసి ధ్రువ పత్రాలను ఉచితంగా అందజేశారు.

జూపాడుబంగ్లా: అర్హత ఉండి పథకాలకు దూరంగా ఉంటున్న నిరుపేదలను తన పాదయాత్రలో గమనించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. తన పాలనలో అలా ఎవరూ ఉండిపోకూడదని నిర్ణయించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కేవలం అర్హత ఆధారంగా మాత్రమే పథకాలు అందజేశారు. అయితే వివిధ కారణాలతో మరికొంత మందికి అందడం లేదని తెలుసుకొని జగనన్న సురక్ష కార్యక్రమం పేరుతో వారికి అవసరమైన 11 రకాల ధ్రువ పత్రాలు అందజేసి. దీంతో వారందరికీ త్వరలో పథకాలు అందనున్నాయి. నియోజకవర్గంలో గత నెల 1 నుంచి 31వరకు జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గం వ్యాప్తంగా 74 సచివాలయాల పరిధిలో ధ్రువ పత్రాలు అవసరమైన వారిని గ్రామ వలంటీర్‌లు,సచివాలయ సిబ్బంది గుర్తించి ప్రత్యేక యాప్‌లో వివరాలను నమోదు చేసి టోకెన్ ఇచ్చారు. మండల స్థాయి అధికారులు విచారణ చేసి అర్హులకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ ప్రక్రియంతా కేవలం నాలుగు రోజుల్లోనే ముగిసిలే చర్యలు చేపట్టడంతో 38,530 మంది ప్రజలకు ఉచితంగా సర్టిఫికెట్లు అందజేశారు. ఇందులో 785 మంది కౌలు రైతులుకు కౌలు కార్డులు అందజేశారు.

క్రియాశీలకంగా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది..

అర్హులను గుర్తించడంలో గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు క్రియాశీలకంగా వ్యవహరించారు. గ్రామ సభలు నిర్వహించే గ్రామాల్లో మూడు నాలుగు రోజుల ముందు ఇంటింటికీ తిరిగి అర్హుల వివరాలను ప్రత్యేక యాప్ లో నమోదు చేసేవారు. ఉన్నతాధికారులు పరిశీలించి నిజమైన అర్హులకు ధ్రువ పత్రాలను గ్రామ సభలో అందజేశారు. ఇలా నియోజకవర్గంలో 74 సచివాలయాల పరిధిలో 72,436 కుటుంబాలకు గాను 71,407 కుటుంబాలను సర్వే చేసి 38,530 మందికి ఉచితంగా 11రకాల సర్టిఫికెట్లను అధికారులు అందజేశారు.



తంగడంచ గ్రామంలో అర్హులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ (ఫైల్)

మండలాల వారీగా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అందించిన ధ్రువ పత్రాలు..

మండలం	సచివాలయాలు	ఇళ్ల సంఖ్య	సర్వే చేసిన ఇళ్లు	ఇచ్చిన సర్టిఫికెట్లు
జూపాడుబంగ్లా	11	9,691	9,467	3,554
పాములపాడు	14	14,435	14,425	2,671
పగిద్యాల	10	11,020	10,870	3,917
నందికొట్కూరు	14	12,618	12,512	10,086
కొత్తపల్లి	11	10,509	9,977	4,429
మిడుతూరు	14	14,163	14,156	13,873
మొత్తం	74	72,436	71,407	38,530

గతంలో కౌలు కార్డుకోసం పలుమార్లు తిరిగా..



గతంలో కౌలు రైతు గుర్తింపు కార్డు కోసం ఎన్నిమార్లు దరఖాస్తు చేసినా ఇవ్వలేదు. ‘జగనన్న సురక్ష’ కార్యక్రమంలో పైసా ఖర్చు లేకుండా ఇచ్చారు. వలంటీర్ ఇంటివద్దకు వచ్చి పేరు నమోదు చేసుకొని వెళ్లారు. గ్రామసభలో అధికారులు,ప్రజా ప్రతినిధులు నాకు కౌలు రైతు గుర్తింపు కార్డు ఇచ్చారు. చాలా సంతోషంగా ఉంది.
– రజాక్, మండ్లెం, కౌలురైతు

వ్యయ, ప్రయాసలు తప్పాయి



గతంలో పిల్లలకు కుల, ఆదాయ సర్టిఫికెట్లు కావాలంటే మండల కేంద్రం జూపాడుబంగ్లాలోని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ రెండు రోజులు తిరిగి తెచ్చుకున్నాం. ‘జగనన్న సురక్ష’ కార్యక్రమంలో వలంటీర్లు ఇంటివద్దకు వచ్చి వివరాలు తీసుకెళ్లారు. గ్రామంలో జరిగిన కార్యక్రమంలో తమను పిలిచి ఉచితంగా సర్టిఫికెట్ ఇచ్చారు. ఎప్పుడూ ఇలా ఇస్తే ప్రజలకు అవస్థలు తప్పుతాయి. – సుజాత, మండ్లెం

అర్హులందరికీ అవసరమైన సర్టిఫికెట్లు ఇచ్చాం



జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్ల దరఖాస్తులు స్వీకరించారు. వాటిని సచివాలయాల్లో అప్‌లోడ్ చేసి జగనన్న సురక్ష గ్రామసభల్లో అర్హులైన వారికి ఎలాంటి రసుము లేకుండా ఉచితంగా అందజేశాం. ఈ కార్యక్రమం వల్ల ప్రజలకు ఎంతగానో మేలు జరిగింది.
– శోభారాణి, ఎంపీడీఓ, నందికొట్కూరు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సంక్షేమ పథకాల గురించి వృద్ధుడికి వివరిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

మిడుతూరు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ పేర్కొన్నారు. శనివారం మిడుతూరు-1 గ్రామ సచివాలయ పరిధిలో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన పథకాల ద్వారా పొందిన లబ్ధిని స్థానిక నాయకులతో కలిసి వివరించి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆలస్యంగా వచ్చిన ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతూ ఉద్యోగులు విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని సూచించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు ప్రస్తావించిన సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమం అనంతరం సోషియల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ చింతామణి ఎమ్మెల్యేను కలిశారు. ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి, తహసీల్దార్ ప్రకాష్ బాబు, ఏఓ పీరునాయక్, ఈఓఆర్డీ ఫక్రుద్దీన్, ఎంఈఓ శ్రీనాథ్, నాయకులు సల్కోటి గోవర్ధన్‌రెడ్డి, కమతం వీరారెడ్డి, రమేష్, సీతారాముడు, వెంకటస్వామి, ఇనాయతుల్లా పాల్గొన్నారు.

ర్యాగింగ్ ఒక సామాజిక రుగ్మత



మాట్లాడుతున జడ్జి వెంకటేశ్వరరావు

ఆత్మకూరురూరల్: ర్యాగింగ్ అనేది ఒక సామాజిక రుగ్మత అని, దానికి దూరంగా ఉండడం మంచి విద్యార్థి లక్షణమని ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం సాన్థిక థెరిస్సా జూనియర్ కళాశాల విద్యార్థుల నుద్దేశించి ప్రసంగించారు. తోటి విద్యార్థులను రాగింగ్ పేరిట మానసిక,శారీరక హింసలకు గురి చేస్తుండటంతో ప్రభుత్వం ర్యాగింగ్‌ను నిషేధించిందన్నారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే అది కాలేజి లోపల, బయట అయినా తీవ్రతను బట్టి సంవత్సరం నుంచి ఏడేళ్ల వరకు, యావజ్జీవ శిక్ష సైతం వేయవచ్చని స్పష్టం చేశారు. కళాశాల యాజమాన్యం కూడా యాంటీ ర్యాగింగ్ స్క్వాడ్ టీం ఏర్పాటు చేసుకుని ర్యాగింగ్ భూతాన్ని కాలేజీ నుంచి తరిమివేయాలని సూచించారు. న్యాయవాదులు సుదర్శన్,మాణిక్యరావు, కళాశాల ప్రిన్సిపాల్ హరికృష్ణ,కరస్పాండెంట్ ప్రణీత్ పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టండి



మాట్లాడుతున్న తహసీల్దార్ పుల్లయ్యయాదవ్

జూపాడుబంగ్లా: గడప గడపకు మన ప్రభుత్వం కింద మంజూరైన రూ.20లక్షలతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని జెడ్పీటీసీ సభ్యుడు పోచా జగదీశ్వరరెడ్డి కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సువర్ణమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ మాట్లాడుతూ మండలంలో 28 మంది డీలర్లు, 11,864 రేషన్‌కార్డులుండగా 8ఎండీయు వాహనాల ద్వారా రేషన్‌సరుకులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. తాగునీటిశాఖ ఏఈ మాట్లాడుతూ రూ.4.40కోట్ల వ్యయంతో 17 గ్రామాల్లో జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వనున్నట్లు చెప్పారు. జగనన్నకాలనీల్లో రూ.97.10లక్షలతో శాశ్వత నీటిసరఫరా కల్పిస్తామన్నారు. చేతిపంపులు మరమ్మతులకు గురైతే రిపేరీ చేసేవారే లేరని మెకానిక్‌ను నియమించాలని జూపాడుబంగ్లా సర్పంచ్ బాలస్వామి కోరగా.. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఎంపీడీఓ సుబ్రహ్మణ్య శర్మ తెలిపారు. ఎంఈఓ-2 శ్రీనివాసులు మాట్లాడుతూ నాడు-నేడు పథకం కింద ఫేజ్-1 కింద 12 పాఠశాలలకు గాను 9పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయన్నారు. ఫేజ్-2కింద 30 పాఠశాలల్లో పనులు జరుగుతున్నాయన్నారు. మండ్లెం జిల్లా పరిషత్ పాఠశాల ఎదుట ఎన్‌హెచ్ 360సీ రోడ్డు నిర్మాణం జరిగితే విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుందని, ఫ్లైఓవర్ ఏర్పాటు చేయించేలా అధికారులకు తీర్మాణం చేసి పంపాలని జెడ్పీటీసీ సభ దృష్టికి తీసుకొచ్చారు. పోలీసు, ఎక్సైజ్‌శాఖ, మత్స్యశాఖ, వైద్యులు, సర్వశిక్షాభియాన్, మైనర్ ఇరిగేషన్, ట్రాన్స్‌కో, పరిశ్రమల శాఖల అధికారులు గైర్హాజరవ్వటంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

దాతల సహకారం.. స్వర్గధామ నిర్మాణం

వెలుగోడు: దాతల సహకారంతో పట్టణంలో హిందూ శ్మశానవాటిక (స్వర్గధామం) నిర్మాణం పూర్తయింది. సుమారు రూ.1.10 కోట్ల వ్యయంతో తీర్చిదిద్దారు. కమిటీ సభ్యులు డాక్టర్ శివశంకర్‌రెడ్డి, రాఘవయ్య, శంకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అల్లె తిరుపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సీతామహాలక్ష్మమ్మ, యాదాటి రవి తదితరులు స్వర్గధామం అభివృద్ధికి కృషి చేశారు. స్వర్గధామంలో మృతదేహాల దహనాల కోసం బర్నింగ్ షెడ్, మెటల్ దహన వాటికను సమకూర్చారు. వర్షాకాలంలో దహనాలకు ఇబ్బంది తలెత్తకుండా బర్నింగ్ షెడ్ నిర్మించారు. మంచినీటి సౌకర్యం, జంగిల్ క్లియరెన్స్, రస్తా సౌకర్యం ఏర్పాటు చేయగా, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి రూ.19 లక్షల నిధులతో ప్రహరీ, కైలాస ద్వారం నిర్మించారు. నిర్మాణాలు పూర్తి కావడంతో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ఎంపీ బ్రహ్మానందరెడ్డి ఆదివారం ప్రారంభిస్తారని కమిటీ సభ్యులు తెలిపారు.

గాజులపల్లెలో ఉద్రిక్తత

మహానంది: గాజులపల్లె గ్రామంలో రెండు వర్గాల మధ్య జరిగిన వివాదం శనివారం ఉద్రిక్తతకు దారి తీసింది. స్త్రీశిశు సంక్షేమశాఖలో ఖాళీగా ఉన్న ఆయా పోస్టు కోసం జరుగుతున్న ప్రయత్నాలు వివాదానికి కారణమైంది. గ్రామంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో ఖాళీగా ఉన్న ఆయా పోస్టు కోసం గ్రామానికి చెందిన రెండు వర్గాల వారు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే వీరిలో ఒకరికి ఇవ్వాలని కొందరు, మరో వర్గం వారు మాకే కావాలంటూ పట్టుబట్టడంతో వివాదం చోటు చేసుకుంది. దీంతో తమపై కత్తులతో దాడికి యత్నించారని మరో వర్గం వారు పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంపై ఎలాంటి కేసు నమోదు కాలేదని ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ లబ్ధి



లబ్ధిదారులకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

ఆత్మకూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నల్లకాల్వ గ్రామంలో రెండో రోజు శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆయా కాలనీలను సందర్శించి ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో అందిన పథకాలు, పొందిన లబ్ధిని చదివి వినిపించి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని తెలుసుకున్నారు. ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చారని, దీంతో మెరుగైన, నాణ్యమైన సేవలు అందుతున్నాయని, పథకాలు ఇంటికే చేరుతున్నాయని చెప్పారు. అర్హులందరికీ ఇళ్ల స్థలాలను త్వరలో అందజేస్తామన్నారు. నియోజకవర్గం నాయకుడు శిల్పా భువనేశ్వరరెడ్డి, వెంకటరమణ, ఎంపీపీ తిరుపాలమ్మ, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, సయ్యద్‌మీర్, రాజమోహన్ రెడ్డి, ఎంపీటీసీ శాంతమ్మ, సుబ్బారెడ్డి, ద్రోణారెడ్డి, వెంకటసుబ్బయ్య, ఎల్లప్ప, ఎంపీడీఓ మోహన్‌కుమార్, తహసీల్దార్ ఉమాదేవి పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రం ప్రారంభం..

గ్రామంలో నూతన రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడుతూ రైతుల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయమని, రైతులకు ప్రభుత్వం రైతు భరోసా కేంద్రం ద్వార ఎరువులు, విత్తనాలు సొంత గ్రామంలోనే అందజేస్తున్నారని, రైతు భరోసా, ఈక్రాప్ నమోదు వంటికి ఇక్కడే చేసుకోవచ్చని చెప్పారు. అనంతరం రైతులకు సబ్సిడీలో ఎరువులు పంపిణీ చేశారు.

నేడు కొత్త రామాపురంలో..

మండలంలోని కొత్తరామాపురం గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో గడప గడప కు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి శనివారం తెలిపారు.



ఆర్బీకేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

ఓటరు జాబితాపై ఇంటింటి సర్వే

ఆత్మకూరు: మండలంలోని వెంకటాపురం గ్రామంలో శనివారం బీఎల్ఓ ఇంటింటికీ తిరిగి ఓటర్ల జాబితాను పరిశీలించారు. బీఎల్ఓ , వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఓటర్ల జాబితాను పరిశీలించారు.

నందికొట్కూరు రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో ఓటరు జాబితాపై ఇంటింటి సర్వే ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకు ఓటరు జాబితాలో సవరణలు, మార్పులకు సంబంధించి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బీఎల్‌వోలు గ్రామాల్లో ఇంటింటి సర్వే చేస్తున్నారు. నాగటూరు గ్రామంలో శనివారం సర్వే ప్రక్రియ చేపట్టారు.

రేపటి నుంచి ‘గడప గడపకు మన ప్రభుత్వం’

పగిద్యాల: స్థానిక 1, 2 సచివాలయాల పరిధిలో సోమవారం నుంచి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ పాల్గొనే కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

నిధుల మంజూరు

కొత్తపల్లి: మండలంలోని అన్ని గ్రామపంచాయతీలకు 15 ఫైనాన్స్ నిధులు మంజూరయ్యాయని ఎంపీడీఓ మేరి శనివారం తెలిపారు. మండలంలో సుమారు 12 గ్రామ పంచాయతీలు ఉన్నాయని వాటికి రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనులు, ఇతర అవసరాల నిమిత్తం నిధులు విడుదల చేసినట్లు ఆమె పేర్కొన్నారు. దుద్యాలకు రూ.5,13,578, ఎదురుపాడుకు రూ.1,25,229, ఎర్రమఠంకు రూ.3,52,073, జీ.వీరాపురం రూ.75,327, గోకవరం రూ.1,77,942, గువ్వలకుంట్ల రూ. 3,51,938, కొక్కెరంచ రూ.2,44,305, కొత్తపల్లి రూ.2,87,532, ముసలిమడుగు రూ.1,38,205, నందికుంట రూ.2,39,066, పెద్ద గుమ్మడాపురం రూ.1,66,304, శివపురంరూ. 2,33,705 ప్రకారం విడుదలయ్యాయని వివరించారు.

సమస్యలను పరిష్కరించండి

నందికొట్కూరు: ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రఘురామమూర్తి కోరారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశా వర్కర్లకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే సెలవులు ప్రకటించాలని, పని భారం తగ్గించాలన్నారు. శంకర్‌నాయుడు, షెక్షావలి, రాముడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

పాములపాడు: గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ గోపీకృష్ణ సూచించారు. శనివారం మండలంలోని జగనన్న కాలనీని పరిశీలించారు. ఆయన నిర్మాణాలపై ఆరా తీశారు. అనంతరం గ్రామంలోని చెంచు కాలనీని సందర్శించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పక్కా గృహ నిర్మాణాలపై ఆర్డీటీ సంస్థ ప్రతినిధులతో చర్చించారు. సర్పంచు మాణిక్యమ్మ, హౌసింగ్ ఇన్‌చార్జ్ ఏఈ శివ, పంచాయతీ కార్యదర్శి తిప్పన్న ఉన్నారు.

విద్యార్థుల శ్రమదానం

జూపాడుబంగ్లా: స్థానిక గురుకుల పాఠశాలకు చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు శనివారం శ్రమదానం చేసి పాఠశాలలకు వెళ్లే దారిని శుభ్రం చేశారు. ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరప్ప విద్యార్థులతో శ్రమదానం చేయించి పాఠశాలలకు వెళ్లే దారిలో ఉన్న ముళ్లపొదలు, చెత్తాచెదారాన్ని తొలగింపజేశారు.

రైతులు ధ్రువ పత్రాలు సమర్పించాలి

కొత్తపల్లి: మండలంలోని జాతీయ రహదారి-167 కె నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులు ధ్రువ పత్రాలు సమర్పించని వారు అందజేయాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పెద్దన్న శనివారం తెలిపారు. మండలంలో 7 గ్రామాల్లో 291.30 ఎకరాలు ఎన్‌హెచ్ 167-కె నిర్మాణం కోసం సేకరించామని, ఇందులో 55.53 ఎకరాలు ప్రభుత్వ భూమి కాగా 235.77 ఎకరాలు రైతులకు చెందినదని చెప్పారు. మొత్తం 560 మంది రైతులు ఉండగా 435 మంది అవార్డు ఎంక్వైరీ ద్వారా ధ్రువపత్రాలు సరిచూసుకొని సమర్పించారని, మిగిలిన రైతులు త్వరగా ధ్రువపత్రాలు అందజేయాలని కోరారు.

నల్లమల ఘాట్‌లో రెండు కార్లు ఢీ

మహానంది: నంద్యాల-గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులో ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొనడంతో ప్రమాదం తప్పిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పోరుమామిళ్లకు చెందిన వెంకటసుబ్బయ్య గిద్దలూరు నుంచి నంద్యాలకు వస్తుండగా అనంతపురం జిల్లాకు చెందిన కసగానపల్లె శ్రీనివాసులు కారు విజయవాడకు వెళ్తుంది. సర్వనరసింహస్వామి మలుపు వద్ద రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో రెండు కార్ల ముందు భాగాలు దెబ్బతిన్నాయి. ఇందులో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. హెడ్‌కానిస్టేబుల్ రామ్మోహన్, రోడ్‌సేఫ్టీ పోలీసులు పీరయ్య, మదనశేఖర్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి కారణమైన రెండు కార్లను మహానంది పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన ఆటో

మహానంది: నంద్యాల నుంచి ఇంటికి వెళ్తున్న ఓ ఆటో అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన సంఘటన బండిఆత్మకూరు మండలం ఈర్నపాడు సమీపంలో శనివారం చోటు చేసుకుంది. కడమలకాల్వ గ్రామానికి చెందిన ఓ ట్రాలీ ఆటో ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వచ్చే మరో వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు.

యువతి అదృశ్యం

మహానంది: బొల్లవరం గ్రామానికి చెందిన 16ఏళ్ల యువతి సుబ్బమ్మ అదృశ్యమైందని ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. గ్రామానికి చెందిన సుబ్బమ్మ ఇంటర్ మధ్యలో ఆపేసింది. ఈ నెల 3న ఇంట్లో భోజనం చేసి తల్లిదండ్రులతో కలిసి నిద్రించింది. మధ్యలో తండ్రి తిరుపాలుకు మెలకువ వచ్చి చూడగా.. యువతి కనిపించలేదు. దీంతో తెలిసిన వారు, బంధువుల ఇళ్ల వద్ద విచారించినా ఫలితం లేకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

విద్యార్థినికి సన్మానం

మిడుతూరు: స్థానిక ఆదర్శ పాఠశాలలో 10 వతరగతిలో సాయిసుజన అనే విద్యార్థిని 570 మార్కులు సాధించడంతో జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆధ్వర్యంలో హిందీ ఉపాధ్యాయుడు జగదీశ్వర రెడ్డి శనివారం రూ.5వేలు ప్రోత్సాహక నగదు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థినికి అభినందన సభ నిర్వహించి సన్మానించారు.

బాల్య వివాహాలు నేరం

జూపాడుబంగ్లా: 18ఏళ్ల లోపు వయస్సు బాల, బాలికలకు వివాహాలు చేయటం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సీడీపీఓ మంగవల్లి తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, ఎంపీపీ సువర్ణమ్మ, సీడీపీఓ మంగవల్లి మాట్లాడారు. ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే టోల్‌ఫ్రీ నంబర్లు 112, 181, 100కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నిర్మల, పావనిరెడ్డి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీఓ మంగవల్లి